హిట్లర్, ముస్సోలినీని మించిన మోడీ-షా

- నిరంకుశ, ఫాసిస్టు పాలన కొనసాగిస్తున్న బిజెపి
- పొగబాంబు ఘటనకు బాధ్యత వహించాలి
- దేశ ప్రజలకు కేంద్రం క్షమాపణ చెప్పాలి
- ఎంపిలపై సస్పెన్షన్‌ను ఎత్తేయాలి
- వామపక్ష పార్టీల నేతల డిమాండ్
- హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో బిజెపి నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం నిరంకుశంగా, ఫాసిస్టు పాలన కొనసాగిస్తున్నదని వామపక్ష పార్టీల నేతలు విమర్శించారు. హిట్లర్, ముస్సోలినీని మించిన నియంతలుగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా వ్యవహరిస్తున్నారని చెప్పారు. పొగబాంబు ఘటనకు మోడీ ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 143 మంది ప్రతిపక్ష పార్లమెంటు సభ్యుల అప్రజాస్వామిక సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తేయాలని కోరుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్‌రోడ్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. 'వామపక్షాల ఐక్యత వర్ధిల్లాలి, ఎంపిలపై సస్పెన్షన్‌ను ఎత్తేయాలి' అంటూ నినాదాలు చేశారు. 'పార్లమెంటు భద్రతపై ప్రశ్నించిన ఎంపిలపై సస్పెన్షన్ వేటు వేయడం సిగ్గు... సిగ్గు..., ఎంపిలను సస్పెండ్ చేసిన బిజెపి ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఖండించండి, ప్రతిపక్ష ఎంపిల అప్రజాస్వామిక సస్పెన్షన్‌లను ఖండించండి' అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బిజెపి ఎంపిలు అజాగ్రత్తగా ఉంటూ పాస్‌లను జారీ చేశారని చెప్పారు. దాన్ని ప్రశ్నించిన ఎంపిలను సస్పెండ్ చేయడం దుర్మార్గమని విమర్శించారు. బిజెపి తీరు ఇలాగే కొనసాగితే ఎంపిల మీద దాడి జరుగుతుందనీ, కాల్చి చంపుతారని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌లో బిజెపి గెలుపుపై అనేక అనుమానాలున్నాయని అన్నారు. యంత్రాలు తారుమారైనట్టు తెలుస్తోందని చెప్పారు. పొగబాంబు ఎందుకు తెచ్చారో, అందుకు కారణాలేంటో తెలుసుకోవాలని సూచించారు. మోడీ, అమిత్‌షాలపై వ్యతిరేకతతో తెచ్చారా?, బిజెపి విధానాలకు వ్యతిరేకంగా తెచ్చారా? అన్న వాస్తవాలను బయటికి తీయాలని డిమాండ్ చేశారు.

పొగబాంబు ఘటనపై ప్రధాని స్పందించాలి : నంద్యాల నర్సింహారెడ్డి

పార్లమెంటుకు అత్యంత భద్రత ఉండాలనీ, అందులోకి దుండగులు చొరబడి పొగబాంబు వేసిన ఘటనపై ప్రధాని, హోంమంత్రి స్పందించాలంటూ ప్రతిపక్ష ఎంపిలు కోరితే వారిని సస్పెండ్ చేయడం దుర్మార్గమని సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి విమర్శించారు. అందరినీ బయటికి వెళ్లగొట్టి మూడు క్రిమినల్ చట్టాలను ఆమోదించారని అన్నారు. పార్లమెంటుకే భద్రత లేకుంటే దేశంలోని ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దేశాన్ని, సరిహద్దును, ప్రజలను కాపాడతామంటూ ఎలా భరోసా కల్పిస్తారని అడిగారు. ఈ ఘటనకు ప్రధాని, హోంమంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం వరకు పార్లమెంటు సమావేశాలుంటే, గురువారంనాడే నిరవధిక వాయిదా వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. శుక్రవారం ఇండియా కూటమి ఆధ్వర్యంలలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలుండడం వల్లే పార్లమెంటు సమావేశాలను నిర్వహించలేదన్నారు. ప్రజాపంథా రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ నిరసన తెలపడమే నేరం అన్నట్టుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. దేశంలో ప్రతిపక్షం లేకుండా ప్రజాస్వామ్యం మనుగడ సాగించగలదా? పాలకులు ప్రజాస్వామ్యవాదులేనా?అని అడిగారు. ప్రజలను మేల్కొల్పాలని, ప్రభుత్వ వ్యతిరేక పోరాటాల్లోకి తేవాలని కోరారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జెవి చలపతిరావు మాట్లాడుతూ పొగబాంబు ఘటనపై ప్రధాని, హోంమంత్రి సమాధానం చెప్పలేక ప్రతిపక్ష ఎంపిలను సస్పెండ్ చేయడం దుర్మార్గమని విమర్శించారు. మూడు రాష్ట్రాల్లో గెలవడం, 370 ఆర్టికల్ రద్దును సుప్రీం సమర్థించడంతో కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు చేస్తున్నదని అన్నారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె గోవర్ధన్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత మహోత్సవాలు జరుపుతున్న వేళ 143 మంది ఎంపిలను బహిష్కరించిన చరిత్ర గతంలో ఎప్పుడూ లేదన్నారు. ఇది మోడీ సర్కారు ఫాసిస్టు చర్య అని విమర్శించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెంటనే స్పందించి సస్పెన్షన్లను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర నాయకులు తేజ మాట్లాడుతూ దేశంలో బిజెపి ఫాసిస్టు విధానాలకు పాతర వేస్తే తప్ప ప్రజలకు విముక్తి లేదన్నారు. అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు మాట్లాడుతూ పార్లమెంటును రక్షించలేని ప్రభుత్వం దేశాన్ని ఎలా కాపాడుతుందని ప్రశ్నించారు. ఎంపీలను సస్పెండ్ చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలంతా నడుం బిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తీగల సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, ఆర్ శ్రీరాంనాయక్, టి స్కైలాబ్‌బాబు, జె బాబురావు, ఆర్ వెంకట్రాములు, బుర్రి ప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, ఎన్ బాలమల్లేష్, వివిఎస్ బోస్, ప్రజా పంథా నాయకులు ఎస్‌ఎల్ పద్మ, ప్రదీప్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సంధ్య, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిఎస్‌ఎంసి ఎన్నికల్లో హెచ్‌ఆర్‌డిఎ ప్యానెల్ గెలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డిఎ) ప్యానెల్ గెలిచింది. బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించిన ఎన్నికలు కావడంతో గత కొన్ని రోజులుగా లెక్కిస్తున్న సంగతి తెలిసిందే. కౌన్సిల్‌లో 13 మంది సభ్యులకు గాను జరిగిన ఎన్నికల్లో హెచ్‌ఆర్‌డిఎ నుంచి నిలబడిన 13 మందికి 13 మంది గెలుపొందడం విశేషం. పోలైన మొత్తం ఓట్లు 13,779 కాగా అందులో 3,311 ఓట్లు చెల్లనివిగా తిరస్కరించారు. చెల్లుబాటైన ఓట్లలో హెచ్‌ఆర్‌డిఎ నుంచి పోటీ చేసిన డాక్టర్ ప్రతిభకు అత్యధికంగా 7,007, డాక్టర్ మహేశ్ కుమార్‌కు 6,735, డాక్టర్ రాజ్ కుమార్‌కు 6,593, డాక్టర్ జి.శ్రీనివాస్‌కు 6,454 వచ్చాయి. ఇదే క్రమంలో హెచ్‌ఆర్‌డిఎ ప్యానెల్‌లోని మిగిలిన వారికి అత్యధిక ఓట్లు పడటంతో వారి గెలుపు ఖాయమైంది. ఈ సందర్భంగా తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా), తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీ-ఎస్‌ఆర్‌డిఎ) ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. టిఎస్‌ఎంసి బలోపేతానికీ, రాష్ట్రంలో అర్హత లేని వైద్యం నుంచి ప్రజల ప్రాణాలను కాపాడంలో కొత్త సభ్యులు కీలక పాత్ర పోషిస్తారని వారు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యతోనే భవిత

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం
- టెన్త్ విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యతోనే విద్యార్థుల భవిత బాగుంటుందని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. విద్య ఉంటేనే సమాజంలో గౌరవం దక్కుతుందని చెప్పారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు మూడు నెలలపాటు నిర్వహించే ప్రేరణ కార్యక్రమాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శాస్త్రీయ ప్రణాళిక, పునశ్చరణతో విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించొచ్చని సూచించారు. చదువుకునే వయసులోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చదువు అనే నిచ్చెనతో ఎంత ఎత్తుకైనా ఎదగొచ్చని అన్నారు. విద్యార్థులు ఇలాంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్, సైకాలజిస్టు పరికిపండ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించండి

- ఐదు నెలల వేతన బకాయిలను ఇప్పించండి
- మంత్రి పొంగులేటికి తెలంగాణ గ్రామరెవెన్యూ సహాయకుల సంఘం వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పూర్వ విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం, విఆర్‌ఎల జెఎసి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాయి. వీఆర్‌ఏలకు ఐడీ కార్డులు, ఐదు నెలల బకాయి వేతనాలు బకాయిలు ఇప్పించాలనీ, గత ప్రభుత్వం హామీనిచ్చిన వారసులకు ఉద్యోగాలు, ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని విన్నవించాయి. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు, జెఎసి కో-కన్వీనర్ ఎన్.గోవింద్, జెఎసి నాయకులు బిర్రు ఎల్లయ్య, దశరథ్‌లు పాల్గొన్నారు. వివిధ శాఖలకు బదిలీ చేసిన వారందరికీ ఎంప్లాయి ఐడీ కార్డులు వెంటనే జారీ చేయాలని వారు మంత్రిని కోరారు. వారసులకు ఉద్యోగాలు అంశంపై విధివిధానాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఇతర జిల్లాలకు, దూర ప్రాంతాలకు బదిలీ చేసిన వారిని సొంత జిల్లాలకు పంపించాలని కోరారు. పూర్వ విఆర్‌ఎల విల్లింగ్‌ను బట్టి శాఖలు మార్పులు చేయాలని సూచించారు. మున్సిపాల్టీల్లో పిహెచ్ వర్కర్స్‌గా నియమించిన వారిని ఒఎస్‌లుగా పరిగణించాలని కోరారు.

జిఎన్‌ఐటిలో రామానుజన్ జయంతి వేడుక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జి.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (జిఎన్‌ఐటి) ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 136వ జయంతి దినోత్సవాన్ని నిర్వహించారు. హ్యుమానిటీస్ అండ్ మ్యాథమెటిక్స్ విభాగం "వేద గణితశాస్త్రం యొక్క ప్రాముఖ్యత" అనే అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ సురేష్‌బాబుతో ప్రత్యేక సెమినార్‌ను ఏర్పాటు చేశారు. పురాతన గణితానికి, ప్రస్తుత సాంకేతికతకు మధ్య ఉన్న సంబంధాన్ని సమగ్ర ఉదాహరణలతో ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులందరికీ పోస్టర్ ప్రజెంటేషన్‌పై పోటీలు నిర్వహించి క్యాంపస్‌లో విద్యార్థులతో గణితం కాన్సెప్ట్‌ల ఆధారంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. విజేతలను ముఖ్య అతిథి డాక్టర్ సురేష్‌బాబు నగదు బహుమతులతో సత్కరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్ రెడ్డి, హెచ్ఒడి డాక్టర్ ఎం.మాధవీలత, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అపర్ణ విజేతలను గణిత సూత్రాలను అర్థం చేసుకోవడంలో, పోస్టర్ ప్రజెంటేషన్‌లలో ప్రదర్శించడంలో వారి ఉత్సాహం మరియు ఆసక్తిని అభినందించారు.

బిడి కార్మికులందరికీ ఒకే వేతనమివ్వాలి

- కనీసం పింఛన్ రూ.10 వేలివ్వాలి
- సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా బిడి కార్మికులందరికీ ఒకే రకమైన వేతనం చెల్లించాలనీ, కనీస పింఛన్ రూ.10 వేలు ఇవ్వాలని సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరా బాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కొనసాగు తున్న ఆలిండియా బిడి వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబం ధం) జాతీయ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించా రు. బిడి కార్మికుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందనీ, బిడి కార్మికుల ఉపాధిని కొల్లగొట్టే విధంగా ముందుకెళ్తున్నదని అన్నారు. దేశంలో 60 లక్షల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న బిడి పరిశ్రమను సంక్షోభంలోకి నెడుతున్న తీరును వివరించారు. ఈ రంగంలో 92 శాతం మంది మహిళా కార్మికులే ఉన్నారనీ, వారి నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని బిడి కంపెనీల యాజమాన్యాలు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వంత పాడుతున్నాయని చెప్పారు. కార్మికులకు న్యాయం చేయాల్సిన లేబర్ అధికారులు కూడా యజమానులతో కుమ్మక్కవుతున్నారని విమర్శించారు. జిఎస్‌టి పేరుతో బిడి కార్మికుల సంక్షేమానికి సెస్సు రద్దు చేసి వారి సంక్షేమాన్ని గాలికి వదిలివేశారని వాపోయారు. బీడీ కార్మికుల పోరాటాలకు సిఐటియు మద్దతుగా ఉంటుందని చెప్పారు. ఆలిండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ జాతీయ అధ్యక్షులు సహదేవన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షు లు ఏకే.పద్మనాభన్, బీడీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి దేబశిశ్రాయ్, తెలంగాణ బీడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. గోపాలస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. రమ, రాష్ట్ర నాయకులు సూర్జహాన్, ఎంఎ. చౌదరి, పద్మ, బాలమణి, తదితరులు పాల్గొన్నారు

సంక్షేమ పథకాలు అందరికీ చేరుస్తాం

- క్రిస్మస్ వేడుకల్లో సిఎం రేవంత్‌రెడ్డి

కేక్‌ను కట్ చేస్తున్న సిఎం, మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో, రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడేది కాంగ్రెస్ పార్టీయేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. డిసెంబర్‌లో అద్భుతం జరగబోతుందని ముందుగానే చెప్పానని గుర్తు చేశారు. ప్రపంచానికే డిసెంబర్ నెల మిరాకిల్ మంత్ అని చెప్పారు. ఎందుకంటే యేసు ప్రభువు జన్మదినమే కారణమన్నారు. దేశంలో సెక్యులర్ భావాలను కాపాడటం కాంగ్రెస్ ప్రధాన బాధ్యతని చెప్పారు. మొన్న కర్ణాటక.. నిన్న హిమాచల్‌ప్రదేశ్... నేడు తెలంగాణలో సెక్యులర్ ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. అప్పుడే మణిపూర్‌లాంటి ఘటనలకు బ్రేక్ పడుతుందన్నారు. ప్రస్తుతం దేశ రక్షణ ప్రమాదంలో పడిందని చెప్పారు. మణిపూర్‌లో మారణహోమం జరిగితే..ప్రధాని ఆ రాష్ట్రాన్ని సందర్శించలేదని విమర్శించారు. ప్రజల ప్రాణాల కంటే ఎన్నికల ప్రచారం ముఖ్యంగా భావించారని తెలిపారు. రాహుల్‌గాంధీ పరామర్శించాలని ప్రయత్నిస్తే అడ్డుకున్నారని విమర్శించారు. నిస్సహాయులకు సహాయం అందించడం మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హత కలిగిన వారికి అవకాశాలు కల్పించటమే ధ్యేయమని చెప్పారు. అందుకు ఉదాహరణగా ఏకే ఆంటోనీ, పెర్నాండెజ్‌లకు కాంగ్రెస్ ఎంతో ప్రోత్సాహాన్ని అందించిందని గుర్తు చేశారు. తెలంగాణలో ఏర్పడ్డ ఇందిరమ్మ రాజ్యంలో పేదల అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. సంక్షేమ పథకాలను ప్రతీ పేదకు చేరేలా చూస్తామని మాటిచ్చారు. మేం పాలకులం కాదు.. సేవకులమని చెప్పారు. ఏ సమ్మస్య వచ్చినా మా దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను, సంస్థలను అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డిజిపి రవిగుప్త, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, అంజన్‌కుమార్ యాదవ్, సంపత్‌కుమార్, క్రైస్తవ మతపెద్దలు, ఫాస్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం

- గవర్నర్, స్పీకర్, సిఎం, మంత్రులు, ప్రముఖులు హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం సాయంత్రం ఎట్ హోం కార్యక్రమాన్ని నిర్వహించారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సిఎం రేవంత్‌రెడ్డి దంపతులు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ్మ, జూపల్లి కృష్ణారావు, సిఎస్ శాంతికుమారి, డిజిపి రవిగుప్తా, మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి ఢిల్లీలో సిఎస్‌ల సమావేశం

- హాజరుకానున్న శాంతి కుమారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ అధ్యక్షతన ఢిల్లీలో ఈనెల 27 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల (సిఎస్‌లు) సమావేశం జరగనుంది. ఈ భేటీకి రాష్ట్రం నుంచి సిఎస్ శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు హాజరు కానున్నారు. గతంలో నిర్వహించిన 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' తరహాలో ఇప్పుడు 'ఈజ్ ఆఫ్ లైఫ్' అనే అంశం ప్రాతిపదికన ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిసింది. పర్యావరణం, పరిశ్రమలు, శాస్త్ర, సాంకేతిక రంగాలు, భూతాపం, భూసేకరణ, నదుల పరిరక్షణ తదితరాంశాలపై ఈ భేటీలో చర్చించనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈనెల 29 వరకూ ఈ సమావేశాలు కొనసాగనున్నాయి.

నేడు బిఆర్‌ఎస్ 'స్వేద పత్రం' విడుదల

కెటిఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తొమ్మిదిన్నరేండ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానం దేశ చరిత్రలోనే ఓ సువర్ణ అధ్యాయమని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగలూ రాత్రి తేడా లేకుండా రెక్కల కష్టంతో చెమటోడ్చి నిర్మించిన తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. విఫల రాష్ట్రంగా చూపించాలని ప్రయత్నిస్తే భరించేది లేదనీ, అగ్రగామి రాష్ట్రాన్ని అవమానిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోబోమని స్పష్టం చేశారు. అందుకే గణాంకాలతో సహా వాస్తవ తెలంగాణ ముఖచిత్రాన్ని వివరించనున్నట్టు తెలిపారు. అప్పులు కాదు.. తెలంగాణ రాష్ట్రానికి సృష్టించిన సంపదను ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో 'స్వేద పత్రం' అనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్టు ఆయన వెల్లడించారు.

అద్దె బస్సులకు టెండర్లు

- గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో 340 బస్సుల కోసంనోటిఫికేషన్
- జనవరి 3వ తేదీలోపు టెండర్లు దాఖలు చేయాలి
- అదేరోజు టెండర్ల ఖరారు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్‌ఆర్‌టిసి) గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో 340 అద్దె బస్సులు కావాలని టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ టెండర్ల దాఖలుకు జనవరి 3వ తేదీ తుది గడువుగా నిర్ణయించారు. అదేరోజు సాయంత్రం టెండర్లు ఓపెన్ చేస్తారు. సికింద్రాబాద్, హైదరాబాద్ రీజియన్లలో నిర్దేశించిన రూట్లలో ఈ బస్సులు నడపాల్సి ఉంటుంది. మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు 91, సిటీ ఆర్డినరీ 20, సిటీ సబర్బన్ 162, సిటీ మఫిషిల్ 67 బస్సులను అద్దెకు తీసుకుంటారు. 2023 భారత్ స్టేజ్-4, ఓబీడీ-2 లేదా ఆ తర్వాతి మోడల్ బస్సుల్ని పరిగణనలోకి తీసుకుంటారు. టిఎస్‌ఆర్ టిసి ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు ఈ టెండర్లలో పాల్గొనరాదని షరతు విధించారు. కిలోమీటర్ల లెక్కన బస్సులకు అద్దె చెల్లిస్తారు. మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సులకు కిలోమీటర్‌కు రూ.4.50 పైసలు, సిటీ సబర్బన్‌కు రూ.4.70 పైసలు, సిటీ ఆర్డినరీ మఫిషిల్‌కు రూ.5, పల్లెవెలుగుకు రూ.5.41 పైసలు చొప్పున చెల్లిస్తారు. మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులకు 8 సంవత్సరాల అగ్రిమెంట్ ఉంటుంది. తొలుత నాలుగేండ్లకే ఒప్పందం ఉంటుంది. ఆ తర్వాత బస్సు కండీషన్, ఇతర అంశాల అధారంగా రెండేండ్లకు ఒకసారి చొప్పున మరో నాలుగేండ్లు అగ్రిమెంట్‌ను పొడిగిస్తారు. సిటీ ఆర్డినరీ, సిటీ సబర్బన్, సిటీ మఫిషిల్ బస్సులకు 12 ఏండ్ల అగ్రిమెంట్ ఉంటుంది. వాటిని కూడా తొలుత నాలుగేండ్ల ఒప్పందం, ఆ తర్వాత బస్సు కండీషన్ ఇతర అంశాలను బట్టి రెండేండ్ల కోసారి చొప్పున మరో 8 ఏండ్లు ఒప్పందాన్ని పొడిగిస్తారు. టెండర్‌లో పాల్గొనే వారు రూ.లక్ష ధరావతు చెల్లించాల్సి ఉంటుంది. సంస్థ వెబ్‌సైట్ http:// tsrtc.telangana. gov.in లో ఇతర వివరాలు తెలుసుకోవచ్చు.

ఉన్నతి, తొలిమెట్టుపై టీచర్లలో సానుకూల దృక్పథం తేవాలి

- పిఎం శ్రీ స్కూళ్లకు నిర్వహణ గ్రాంటును విడుదల చేయాలి
- విద్యాశాఖ కమిషనర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉన్నతి, తొలిమెట్టు కార్యక్రమాలపై ఉపాధ్యాయుల్లో మరికొంత సానుకూల దృక్పథం తేవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. పీఎం శ్రీ పథకంలో ఎంపికైన ఉన్నత పాఠశాలలకు నిర్వహణ గ్రాంటును వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఆరు, ఏడు తరగతుల వారికి, విద్యాప్రమాణాలు పెంచేందుకు అమలు చేస్తున్న ఉన్నతి కార్యక్రమంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. కొంతమంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం అవసరమే కానీ కొన్ని అనవసర అంశాలు, రోజువారీ పాఠ్యబోధనలో అవసరంలేని స్టెప్స్ ఉన్నాయంటూ అభిప్రాయపడుతున్నారని పేర్కొన్నారు. వాటిని తొలగిస్తే మంచిదనీ, అవసరం లేని టెస్టులు, రాతపనులను తగ్గిస్తే బాగుంటుందని కొందరు ఉపాధ్యాయులంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని రద్దు చేయడం మంచిదని మరికొందరు అభిప్రాయపడుతున్నారని తెలిపారు. తొలిమెట్టు ప్రవేశపెట్టి రెండో ఏడాదైనా ఈ కార్యక్రమాన్ని కూడా ఉపాధ్యాయులు పూర్తిగా రిసీవ్ చేసుకుని ముందుకు తీసుకుపోవడంలో తరతమ బేధాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ రెండు కార్యక్రమాల్లో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్లలో కూడా పూర్తి సానుకూలత కనిపించలేదని తెలిపారు. తొలిమెట్టు వల్ల ఈ విద్యాసంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగాల్సి ఉండేదని సూచించారు. కానీ స్థూలంగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ తగ్గినట్టు సమాచారముందని వివరించారు. కాబట్టి తగు చర్యలతో ప్రభుత్వ పాఠశాలల ఉన్నతికి తోడ్పడేదలా పై రెండు కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. పీఎంశ్రీ పథకంలో ఎంపికైన ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు నిర్వహణ గ్రాంటును విడుదల చేయలేదని తెలిపారు. ఇది కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకమైనందున కేంద్రం నుంచి నిధులు విడుదల కాలేదో, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం తన 40 శాతం నిధులివ్వలేదో తనకు సమాచారం పాఠశాలలు ప్రారంభించి ఆర్నెల్లు దాటిందని తెలిపారు. పిఎం శ్రీకి ఎంపికైన పాఠశాలలన్నీ విద్యార్థుల నమోదు ఎక్కువగా ఉన్నవేనని వివరించారు. నిర్వహణ గ్రాంటు విడుదల చేయకపోవడం వల్ల ఆ పాఠశాలలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. 1,200 పాఠశాలలే ఉన్నందున కమిషనర్ పరిధిలో ఉన్న నిధుల నుంచి గ్రాంటు ఇవ్వాలని కోరారు. తర్వాత రీయింబర్స్ చేసుకోవాలని సూచించారు. లేదంటే జిల్లా కలెక్టర్ల నుంచైనా ఇప్పించి తర్వాత వారికి రీయింబర్స్ చేయాలని తెలిపారు.

మహారాజశ్రీ ప్రధాన జిల్లా న్యాయస్థానం
విశాఖపట్నం
అప్పీలు నెం.47/2023

Between :
కవ్వాడి గంగాభవాని - అప్పిలెంట్
And
జానపల్లి నాగార్జునరావు - రెస్పాండెంట్

అప్పీలు నోటీసు

To,
జానపల్లి నాగార్జునరావు, S/o శ్రీరాములు
ప్లాటు నెంబరు : 402, శ్రీకృష్ణసాయి అపార్టుమెంట్స్, యూసఫ్‌గూడ చెక్‌పోస్ట్, హైదరాబాద్ -45.

పైనుదహరించిన అప్పీలును కవ్వాడి గంగాభవాని గారు మీ పైన మహారాజశ్రీ జిల్లా ప్రధాన న్యాయస్థానం యందు వేసియున్నారు. సదరు అప్పీలు తే.23/01/2024దీకు మీ హాజరు కొరకు వాయిదా వేయుట జరిగినది. కావున తే.23/01/2024దీన ఉదయం 10.30 గం.లకు మీరు గాని,మీ తరపున మీ వకీలు గారు గాని శ్రీకోర్టు వారి ముందు హాజరు కావలసియున్నది. అట్లు కానిచో సదరు అప్పీలు మీపరోక్షమున తీర్మానించటము జరుగునని యిందు మూలంగా తెలియచేయటమైనది.

(By Court order)
లగుడు శ్రీనివాసమ్మ
న్యాయవాది
డోర్ నెంబరు 7-15-35,
గాజువాక, విశాఖపట్నం
సెల్ : 9989234547

IN THE COURT OF THE HON'BLE III ADDl JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT L.B.NAGAR
O.S.NO. 846 OF 2023

BETWEEN:
Muliki Rajeshwari and others
...PLAINTIFFS
AND
L.Dhara Veerraju Balla and others
... DEFENDANTS

To
1. L.Dhara Veerraju Balla , S/o. Balla Chandra Mouli, Aged about 44 years, Occ:Business, R/oH.No.15-145/18, Kodandaram Nagar, Sharada Theatre, Dilsukhnagar, Saroornagar, Ranga Reddy Dist.
2. The Tahsildar Saroornagar Mandal, Ranga Reddy Dist.
3. ALL CONCERNED

The Plaintiffs have filed the above Suit vide O.S.No. 846 of 2023 against you and others for Declaration to declare the plaintiffs as legal heirs of deceased Muliki Venkata Veera Bhadra Rao and the said suit is posted on 12.01.2024 for your appearance. You are therefore hereby directed to appear before this Hon'ble court on the above date at 10.30 A.M. either in person or through your counsel, failing which the matter will be decided in your absence as per law.

// BY ORDER OF THE HONOURABLE COURT //

Sd/-
G.PAVAN KUMAR
ADVOCATE
H.No.3-11-473/1,
Shiva Mahindra Nilayam,
Shiva Ganga Colony,
L. B. Nagar,
Hyderabad-500074.
Mob . 8142601555

IN THE COURT OF THE HON'BLE IV ADDL. DISTRICT JUDGE R.R. DIST. AT : L.B.NAGAR
O.S.NO. 762 OF 2023

Between:
Smt. Vupputuri Anuradha & another
...Plaintiffs
AND
Ch. Praveen Kumar & others
...Defendants

To
All Concerned Defendant No.3

NOTICE

That the above named Plaintiffs filed the above suit for Declaration to declare them as legal heirs of deceased Nallamada Devender Reddy s/o Late Nallamada Narsi Reddy, who died intestate on 28-12-2020 in a road accident by leaving behind the Plaintiffs as his legal heirs and successors to succeed his estate against you and others and the said suit is posted on 23-01-2024 for objections. If any person or persons is/are having any objections he/she/they may appear before the Hon'ble IV Addl. District Judge, Ranga Reddy District at L.B.Nagar on 23-01-2024 at 10:30 A.M. either in person or through an Advocate, failing which the matter will be decided as per law in your absence. SCHEDULE 'A' PROPERTY All that part and parcel of Land bearing Plot No.128, North Part, admeasuring 220 sq. yards or equivalent to 183.94 sq. meters, in Sy.No.87/20 to 87/25, Ward No.8, Block No.9, Dathu Nagar, Saroornagar Mandal, Ranga Reddy District and bounded by: NORTH Plot No.129, SOUTH: Plot No.128 South Part, EAST: 33' wide Road WEST : Plot No.113

SCHEDULE 'B' PROPERTY

All that part and parcel of Flat No.102 in 1 st Floor, NISARGA RESIDENCY, with undivided share of House bearing H.No.1-152/2 and 1-124 (Old) and New H.No.9-9- 9/3/1, land admeasuring 30 sq. yards or equivalent to 25.08 sq. meters, out of 533.33 sq. yards with a Plinth area of 925 sq. feets including common areas in Plot No.70 & 71 in Sy.No.10 & 15, situated at Reddy Colony, Thumulakunta village, Saroornagar Mandal, Ranga Reddy District and bounded by: Boundaries to entire Land: NORTH: Plot No.72, SOUTH: 30' wide Road, EAST: 30' wide Road, WEST: Plot No.68 & Neighbours Land, Boundaries to Flat No.102: NORTH: Flat No.104 & 7 feet Corridor, SOUTH: Open to Sky, EAST: Open to Sky, WEST: Flat No.101

SCHEDULE 'C' PROPERTY

All that part and parcel of residential house situated at Block No.12, Sy.No.756, in Old H.No.12-179 and new H.No.12-287 and 12-287/1, admeasuring 414.33 sq. yards, situated at Devarakonda village and Mandal, Nalgonda District and bounded by: NORTH: Road, SOUTH: Devarakonda-Mahabubnagar PWD Road, EAS: House of N. Jayasudha, WEST: House of M. Jaipal Reddy

SCHEDULE 'D' PROPERTY

All that part and parcel of Plot No.321, in Sy.No.731, 732, 745 in Block No.19, admeasuring 213.88 sq. yards, in residential area of Devarakonda village and Mandal, Nalgonda District and bounded by: NORTH: Plot No.322, SOUTH : Plot No.320, EAST: 33' wide Road, WEST: Plot No.336

SCHEDULE 'E' PROPERTY

All that part and parcel of Open Plot bearing Nos.1734 and 1809, sector-B, in Sy.No.438/B/E/2, total admeasuring 600 sq. yards or 501.66 sq. meters, (each Plot admeasuring an extent of 300 sq. yards within one boundary) situated at Shiva Sai Project, Mallapur village, Yadagirigutta Mandal, Yadadri-Bhongir (Previously Nalgonda) District and bounded by: NORTH: Plot Nos.1733 & 1810, SOUTH:40' wide Road, EAST: 30' wide Road, WEST: 30' wide Road

SCHEDULE 'F' PROPERTY

All that part and parcel of Open Plot bearing Nos.1733 & 1810, sector-B, in Sy.No.438/B/E/2, total admeasuring 400 sq. yards or 334.44 sq. meters, (each Plot admeasuring an extent of 200 sq. yards within one boundary) situated at Shiva Sai Project, Mallapur village, Yadagirigutta Mandal, Yadadri-Bhongir (Previously Nalgonda) District and bounded by: NORTH: Plot Nos.1732 & 1811, SOUTH: Plot Nos.1734 & 1809, EASTL 30' wide Road, WEST:30' wide Road

SCHEDULE 'G' PROPERTY

All that part and parcel of Two Open Places each Open Land admeasuring 89.83 sq. yards or equivalent to 75.11 sq. meters, in total admeasuring 179.66 sq. yards in Sy.No.104/A1, situated at Godakondla village, Chinthapally Mandal, Nalgonda District and bounded by: Boundaries to land admeasuring 89.83 sq. yards NORTH: Land of J. Ramakrishna SOUTH: Land of S. Srinivas EAST :18' internal road, WEST: Hyderabad – Nagarjuna Sagar PWD Road Boundaries to land admeasuring 89.83 sq. yards NORTH: Land of K. Uttaramma SOUTH: Land of J. Yadagiri EAST :18' internal road, WEST: Hyderabad – Nagarjuna Sagar PWD Road

(BY ORDER OF THE COURT)
(M. SHIVA SHANKAR)
(N.NARESH KUMAR)
(CH. BAL REDDY)
Advocates, Plot No.5, Thulja Bhavani Colony, Hastinapuram, Hyderabad
Counsel for the Plaintiffs
Phone No. 9440725458

సామాన్యుడూ ఎమ్మెల్యే కావొచ్చు

- డబ్బుంటేనే గెలుస్తామనే అపోహ పక్కనబెట్టండి
- నిర్దిష్ట లక్ష్యంతో కష్టపడితేనే గెలుపు
- ఎంత సంపాదించామన్నది కాదు.. ఎంత పంచామన్నదే ముఖ్యం
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల అలుమ్నీ మీట్‌లో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

డబ్బులుంటేనే రాజకీయాల్లో గెలుస్తామనే అపోహను పక్కన పెట్టాలని యువతకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి సూచించారు. నిత్యం ప్రజల మధ్యనే ఉండి సేవచేస్తే వారు తప్పకుండా ఆదరిస్తారన్నారు. ఇందిరమ్మ ఇంట్లో నివసించే సామాన్యుడూ ఎమ్మెల్యే కావొచ్చునని, అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని చెప్పారు. తాము పాలకులం కాదనీ, ప్రజా సేవకులమని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు. తెలంగాణ పునర్నిర్మాణం కోసం కలిసిరావాలని, ఈ విషయంలో అందరి సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు. దేశం మనదని, రక్షించుకోవాల్సిన బాధ్యత యువతదేనని పిలుపునిచ్చారు. పిల్లలంతా కష్టపడి చదవాలని, నిర్దిష్ట లక్ష్యం పెట్టుకుని ముందుకెళ్తే గెలుపు సాధ్యమని నొక్కి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విద్యాసంస్థలో మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) తొమ్మిదో వర్ధంతిని పురస్కరించుకుని అలుమ్నీ మీట్, గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. కాకా విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆశీర్వాదం, నిరుద్యోగుల పోరాటం వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. నాలుగు కోట్ల ప్రజల ఆశీర్వాదంతో గెలిచామని, తమ పార్టీలో రాజకీయ ఉద్దండులున్నా యువతకు అవకాశమివ్వాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ, అధ్యక్షులు ఖర్గే తనకు సిఎం బాధ్యతలు అప్పగించారని తెలిపారు. తెలంగాణను అభివృద్ధి చేసే బాధ్యతను తన భుజాలపై పెట్టిన ప్రజలకు, కాంగ్రెస్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. వివేక్, వినోద్ రామాయణంలో లవకుశుల లాంటివారని కొనియాడారు. ఎంత సంపాదించామనేది కాదు.. సమాజానికి ఎంత పంచామనేది కాకా విధానమన్నారు. వెంకటస్వామి వర్ధంతి రోజు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం గొప్ప విషయమన్నారు. లాభాపేక్ష లేకుండా విద్యార్థులకు విద్యనందిస్తున్న ఘనత కూడా కాకా కుటుంబానికే దక్కుతుందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కాకా ముందున్నారని, ఢిల్లీలో కాంగ్రెస్ కార్యాలయానికీ తన ఇంటినే ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటికీ కాంగ్రెస్ ఆఫీస్ కాకా పేరుతోనే ఉందన్నారు. దేశానికి గాంధీ కుటుంబం ఎలాగో..తెలంగాణకు కాకా కుటుంబం అలా అని కొనియాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు అండగా ఉంటామని భరోసానిచ్చారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో గాడితప్పిన విద్యావ్యవస్థను తీర్చిదిద్దడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. విద్యార్థి ఉద్యమ కాలం నుంచి కాకాతో తనకున్న అనుబంధాన్ని ఆయన ఈ సందర్భంగా పంచుకున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సింగరేణి బిఎఫ్ఐఆర్ పరిధిలోకి పోకుండా స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థగా ఎదగడంలో కాకా పాత్ర మరువలేనిదన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని బలంగా నమ్మిన నేతల్లో కాకా ఒకరన్నారు. పేదలకు కూడు, గూడు, కనీస సౌకర్యాలుండాలనే తపించిన నేత కాకా అని కొనియాడారు. ఎమ్మెల్యే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల చైర్మన్ వివేక్ మాట్లాడుతూ దేశంలో పెన్షన్, రేషన్ కార్డుల పథకాల రూపకల్పనలో కాకా పాత్రను వివరించారు. పేదలకు ఇళ్లు ఇప్పించాలనే, విద్య అందించాలనే తపన ఆయనలో బలంగా ఉండేదన్నారు. విద్యార్థులు కలలు కనాలని, సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి సరోజా వివేక్, ప్రజా గాయకులు విమలక్క, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి, రొనాల్డ్‌రాస్, పుప్పాల లక్ష్మీనారాయణ, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలుమ్నీ మీట్, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

పెండింగ్ చలానాలపై భారీ డిస్కౌంట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాహనదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెండింగ్ చలానాలపై భారీ డిస్కౌంట్ ప్రకటించింది. తోపుడు బళ్లు, ఆర్‌టిసి బస్సులపై 90 శాతం, టూవీలర్స్, ఆటోలపై 80 శాతం, ఫోర్ వీలర్స్, కార్లు, ఇతర వాహనాలపై 60 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. ఈనెల 26వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు డిస్కౌంట్ చలానాల చెల్లింపునకు అవకాశం కల్పించారు. 2022 మార్చి 31 నాటికి రాష్ట్రంలో 2.4 కోట్ల చలానాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని తగ్గించుకోవాలన్న ఉద్దేశంతో గత ఏడాది ప్రత్యేక రాయితీ ప్రకటించారు. ద్విచక్ర వాహనాలకైతే 75 శాతం, మిగతా వాటికి 50 శాతం రాయితీ ఇచ్చారు. దీనికి అనూహ్య స్పందన వచ్చింది. కేవలం 45 రోజుల వ్యవధిలో రూ.300 కోట్ల వరకూ వసూలయ్యాయి. దాదాపు 65 శాతం చలానాలు చెల్లించారు. ఆ తర్వాత మళ్లీ పెండింగ్ భారం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

15 నెలల చిన్నారికి కరోనా

నీలోఫర్‌లో చికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నాంపల్లిలోని నీలోఫర్ ఆస్పత్రిలో 15 నెలల చిన్నారికి కరోనా పాజిటివ్ వచ్చింది. చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషా రాణి శుక్రవారం వివరాలు వెల్లడించారు. నాంపల్లికి చెందిన ఓ బాబుకు దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్య ఉండటంతో 18వ తేదీన నీలోఫర్ ఆస్పత్రికి తీసుకొచ్చారని తెలిపారు. లక్షణాలను బట్టి డాక్టర్లు కరోనా పరీక్ష చేయించారన్నారు. అందులో గురువారం పాజిటీవ్‌గా రిపోర్టు వచ్చిందని తెలిపారు. చిన్నారికి ప్రస్తుతం ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. చిన్నారి తల్లిదండ్రులకు ఎలాంటి కోవిడ్ లక్షణాలూ లేవని చెప్పారు. ఆస్పత్రిలో కోవిడ్ కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇదిలా ఉండగా, వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ త్రివేణి నీలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో సమావేశం నిర్వహించి కోవిడ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చర్చించారు.

రైతాంగ సాయుధ పోరాట కవి సుద్దాల



దశాబ్ది పూర్వ మహనీయుల కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీధర్

ప్రజాశక్తి కల్చరల్

సుద్దాల హనుమంతు కేవలం గీత రచయిత మాత్రమే కాదని తెలంగాణ రైతాంగ ఉద్యమం లో ఆయుధం పట్టిన కవి అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్ తెలిపారు శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గానసభ నిర్వహణలో జరుగుతున్న దశాబ్ది పూర్వ మహనీయులు కార్యక్రమాల్లో భాగంగా సుద్దాల హనుమంతు యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది.ముఖ్యఅతిథిగా అయాచితం శ్రీధర్ పాల్గొని మాట్లాడారు. వీరోచిత పోరాటాల గడ్డ నల్గొండ జిల్లా లోని పల్లెలో పుట్టిన హనుమంతు చిన్న నేటినుంచే భూస్వాములకు నైజాం పాలనకు వ్యతిరేకంగా వుద్య మించారని అన్నారు. బండెనక బండి కట్టి గీతంతో హనుమంతు నాడు తెలంగాణ గ్రామీణ ప్రజలను చైతన్య పరిచారని అన్నారు.గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై యువకళావాహిని సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మి నారాయణ మాట్లాడుతూ గాన సభ నిర్వహణలో వివిధ రంగ ప్రముఖులకు నివాళులు గా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిని నేటి తరానికి గుర్తు చేయటం అభినందనీయం అన్నారు గాయకుడు త్రినాధ్ రావు,గాన సభ సభ్యుడు శంకర్ ప్రసాద్ పాల్గొన్నారు

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

- ఓ కుటుంబాన్ని కాపాడిన వాచ్‌మెన్, కానిస్టేబుల్
- పంజాగుట్టలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పంజాగుట్టలోని ఓ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. ట్రాఫిక్ కానిస్టేబుల్, వాచ్‌మెన్ వెంటనే స్పందించడంతో ఓ కుటుంబం ప్రాణాలతో బయటపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రమంజిల్‌లోని ఓ అపార్ట్‌మెంటులోని ఆరో అంతస్తులో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన వాచ్‌మెన్ ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. అక్కడే ఉన్న పంజాగుట్ట ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రావణ్‌కు విషయం చెప్పడంతో వెంటనే ఆయన స్పందించారు. ఇద్దరూ కలిసి అక్కడున్న డంబెల్ సహాయంతో ఆరో అంతస్తులోని డోరును బద్దలు కొట్టి కుటుంబాన్ని బయటకు తీసుకొచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఇంట్లో ఉన్న మంచాలు, బీరువాలు ఇతర సామాగ్రి కాలిపోయాయని ఫైర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ఘటన జరిగిందన్నారు. ప్రాణాలకు తెగించి కుటుంబాన్ని కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రవణ్‌ను, వాచ్‌మెన్‌ను స్థానికులు అభినందించారు.

ఒసి రెండు వర్క్‌షాప్‌లో కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతున్న బి మధు

అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయండి

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి టిపిటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సిఇఆర్‌డిలో అక్రమ డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంను శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ సంఘం అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. పాఠశాల విద్యాశాఖలో ఎస్ఇఆర్‌డి ముఖ్యపాత్ర పోషిస్తుందని వారు తెలిపారు. అక్కడ ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, పుస్తక రచయితలుండాల్సిన చోట ఎలాంటి రాత పరీక్ష లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఫారిన్ సర్వీస్, వర్క్ డిప్యుటేషన్, ఓరల్ డిప్యూటేషన్ పేరుతో అర్హతలేని కొంత మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యావ్యవస్థను వారు పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు.

విద్యార్థుల, ఉపాధ్యాయుల సంక్షేమమే మా ఎజెండా

- టిఎస్‌యుటిఎఫ్ మైనార్టీ గురుకుల రాష్ట్ర కమిటీ పునరుద్ఘాటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనార్టీ గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయుల సంక్షేమమే తమ ఏజెండా అని టిఎస్‌యుటిఎఫ్ మైనార్టీ గురుకుల రాష్ట్ర కమిటీ పునరుద్ఘాటించింది. ఈ మేరకు మైనార్టీ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి షఫీఉల్లాను టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య నేతృత్వంలో కలిసి ఆ సంఘం రాష్ట్ర కమిటీ బాధ్యులను పరిచయం చేశారు. మైనార్టీ గురుకుల రాష్ట్ర కమిటీ అధ్యక్షులుగా జి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం మహేశ్, కోశాధికారిగా పి నరసింహ, ఉపాధ్యక్షులుగా పి భరత్, కె శైలజ, బి లింగస్వామి, వి రాజిరెడ్డి, ఎస్‌కె జావిద్, ఎం జ్యోతి, ఎస్‌కే మోసిన్, కార్యదర్శులుగా వి దామోదర్, భూపేందర్ కౌర్, కె నరేష్‌కుమార్, జి మల్లేషం, ఎస్ గంగారెడ్డి, కె సుమతిరెడ్డి, జి విజయ్ ఎన్నికయ్యారని వివరించారు. ఈ సందర్భంగా మైనార్టీ గురుకుల సొసైటీ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అన్ని అంశాలనూ పరిశీలించి ప్రతి నెలా సంఘాలను పిలిచి సమీక్ష నిర్వహిస్తామంటూ కార్యదర్శి సానుకూలంగా స్పందించారని తెలిపారు. బదిలీలు, పదోన్నతులు, ఉపాధ్యాయుల సిపిఎస్ పెండింగ్ బిల్లులు సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలని కోరగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేయాలంటూ సంఘ నాయకులకు ఆయన సూచించారని వివరించారు.

శోభాయమానంగా సీతారాముల తెప్పోత్సవం

- హంస వాహనంపై విహరించిన భద్రాద్రి రామయ్య
- కనులారా తిలకించిన సందర్శకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో కీలక ఘట్టమైన శ్రీరాముని తెప్పోత్సవ కార్యక్రమం వేలాది మంది సందర్శకుల సమక్షంలో వేద మంత్రాల మధ్య కొనసాగింది. ఈ నెల 13వ తేదీన ప్రారంభమైన అధ్యయనోత్సవాల్లో అవతారాలను ముగించుకున్న సీతారాములకు.. పవిత్ర గోదావరిలో శుక్రవారం సాయంత్రం ఆరు గంటల నుంచి తెప్పోత్సవం కార్యక్రమాన్ని అట్టహాసంగా ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించారు. 1971లో మొదటిసారిగా వైకుంఠ ఏకాదశి అధ్యాయం ఉత్సవాల్లో స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆలయ అధికారులు నాటి నుంచి నేటి వరకు ప్రతి ఏడాది సరికొత్త హంగులతో కొనసాగిస్తున్నారు. గోదారిలో స్వామి వారు జలవిహారం చేసే సమయంలో తీర ప్రాంతంలో దేవస్థానం ఆధ్వర్యంలో బాణసంచా కాల్చటం విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ కార్యమ్రాన్ని దేవాదాయ శాఖ తోపాటు పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖల సమన్వయంతో విజయవంతంగా ముగిసింది.

మార్పు రావాలి.. సిఐటియు గెలవాలి..

- సూర్యుడు గుర్తుపై ఓటు వేసి గెలిపించండి
- 'సింగరేణి' ఎన్నికల ప్రచారంలో బి మధు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్పు రావాలంటే.. సిఐటియు గెలవాలని, సింగరేణి సంస్థ గుర్తింపు ఎన్నికల్లో ఉదయించే సూర్యుడు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి మధు పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు మండలంలో శుక్రవారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) మణుగూరు బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఒసి రెండు వర్క్‌షాప్‌లో కార్మికుల ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ నెల 27న జరగబోయే సింగరేణి కార్మిక సంఘం ఎన్నికలు కార్మికుల హక్కులు కాపాడుకునే విధంగా ఆలోచన చేసి సిఐటియుని గెలిపించాలని కోరారు. సొంతింటి కల పెరిక్స్ ఇన్‌కమ్ టాక్స్ రియంబర్స్‌మెంట్ ఇప్పిస్తామన్నారు. సింగరేణి కార్మిక పిల్లలకు సిబిఎస్ఇ సిలబస్‌తో నాణ్యమైన విద్య, 250 గజాల ఇంటి స్థలం, సింగరేణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, కారుణ్య నియామకాలు తదితర డిమాండ్లతో కూడిన హామీలను సిఐటియు కార్మికులకు ఇచ్చిందని తెలిపారు. సింగరేణిలో ప్రమోషన్లు వస్తే జీతం పెరగడం కన్నా జీతం తగ్గే పరిస్థితి ఎందుకు వచ్చిందని ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, టిబిజికెఎస్ సంఘాల వాళ్లని అడగాల్సిన అవసరముందని, దీనిపై ఆలోచించాలని కోరారు. అనంతరం యూనియన్ రాష్ట్ర నాయకులు కె బ్రహ్మాచారి మాట్లాడారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు టివిఎంవి ప్రసాద్, డివిజన్ కన్వీనర్ గద్దల శ్రీనివాస్, నాయకులు మాచారపు లక్ష్మణరావు, నందం ఈశ్వరరావు, విల్సన్ వై రామ్మూర్తి, కొడిశాల రాములు, సూర్యనారాయణ, యు నరసింహారావు, సత్రపల్లి సాంబశివరావు, హేమంతరావు, వెంకన్న, కార్మిక సోదరులు పాల్గొన్నారు.

ధర ఉన్నా.. మిగిలేది సున్నా..!

- పంట కోత ప్రయోగంతో మరింత దయనీయం
- ఎకరా వరికి 30 క్వింటాళ్లకు గాను 20 క్వింటాళ్లే
- ఎకరా పత్తికి 10 క్వింటాళ్లకు గాను 6 క్వింటాళ్లే
- పెట్టిన పెట్టుబడి రాని దుస్థితి..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అటు అకాల వర్షాలు.. ఇటు వర్షాభావంతో కర్షకులు కలవరపడుతుండగా దళారుల దోపిడీతో చిక్కిశల్య మవుతున్నారు. అరకొర పంట దిగుబడులకైనా గిట్టుబాటు ధర లభిస్తోందని ఆశిస్తే దళారులు గద్దల్లా వచ్చి తన్నుకుపోతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించిన పంట కోత ప్రయోగల్లోనూ దిగుబడి తగ్గినట్టుగా తేలింది. దాంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీ వర్షాలకు పంటలు జలమయ్యాయి. ఇందుకు జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలమే నిదర్శనం.

మండల పరిధిలోని తాడిచెర్ల, మల్లారం, వళ్లెంకుంట, కొండంపేట, కుంభంపల్లి, పీవీనగర్ తదితర మానేరు పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో 15,046 ఎకరాల్లో వరి, 3,657 ఎకరాలకుపైగా పత్తి సాగు చేశారు. కానీ, వరి గొలుసు వేసిన దశలో వర్షాలు కురవడంతో పూత రాలిపోయింది. దీనికి తోడు తెగుళ్లు అంటుకున్నాయి. పత్తి పంట ఎదుగుదల దెబ్బతినగా పెట్టుబడి మరింత పెరిగింది. ఈ క్రమంలో 150కి పైగా పంట కోత ప్రయోగాలు చేపట్టగా దిగుబడులు తక్కువగా రావడం రైతుల దుస్థితి మరింత దయనీయంగా మారింది. పావుగంట పంటకోత ప్రయోగం చేస్తే పత్తి 10 నుంచి 12 కిలోలు రావాలి. వరి 20కిలోల దాకా రావాలి. కానీ, పత్తి 5 నుంచి 6 కిలోలు రాగా, వరి ధాన్యం 14 నుంచి 15 కిలోలు మాత్రమే వస్తుంది. ఈ లెక్కన ఎకరాకి ధాన్యం 30 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 20 నుంచి 25 క్వింటాళ్లు మాత్రమే వస్తోంది. ఎకరానికి పత్తి 10 నుంచి 12 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 6 నుంచి 8 క్వింటాళ్లు మాత్రమే వస్తోంది. మండల వ్యాప్తంగా రైతులు సుమారు 10 టన్నుల వరిధాన్యం, 12 టన్నుల పత్తి నష్టపోతున్నారు. మొత్తంగా పత్తికి రూ.2 కోట్లు, ధాన్యంకు రూ.3 కోట్లు కలిపి రూ. 5కోట్ల దాకా నష్టపోతున్న పరిస్థితి.

నష్టపరిహారం ఊసే లేదు?

గత రెండు సీజన్లు కలిపి అకాల వర్షాలకు మానేరు పరివాహక ప్రాంతాల్లో 5,789 ఎకరాల్లో ఇసుక మేటలు పెట్టి పంటలు దెబ్బతిన్నాయి. 500 కరెంట్ స్తంభాలు కొట్టుకుపోయాయి. 150 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. 2 వేల కరెంట్ మోటార్లు కొట్టుకుపోయాయి. నామమాత్రంగా పంట నష్టానికి ప్రాథమిక అంచనా నివేదికలు తయారు చేసి గత ప్రభుత్వం చేతులు దులుపుకుంది. గతంలో బ్యాంకు రుణాలు పొందిన రైతులకు పరిహారం వచ్చేది. పంటల బీమా ప్రీమియం చెల్లించినవారికి పరిహారం అందేది. ఈ సారి ఆ ఊసేలేదు. మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలు నామమాత్రంగా జరుగుతుండడంతో రైతులు దళారులను, రైస్ మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు. దాంతో వ్యాపారులు సిండికెట్‌గా మారి తూకంలో తరుగు, నాణ్యత పేరుతో కిలోల కొద్దీ కోత విధిస్తూ దోచుకుంటున్న పరిస్థితి.

నిండా మునిగిన : లక్ష్మయ్య, రైతు, తాడిచెర్ల

నేను మూడెకరాల్లో వరి వేసిన. మొదట పంట మంచిగుండే. మధ్యలో వర్షాలు పడి తెగుళ్లు సోకాయి. వానలు అనుకూలంగా పడలేదు. వరి కోస్తే 25 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఎప్పుడైనా 80 క్వింటాళ్లు వచ్చేవి. దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

కారును ఢీకొన్న లారీ

- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- ఏటూరు నాగారంలో మిన్నంటిన రోదనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేములవాడ దైవదర్శనం కోసం కారులో వెళ్తుండగా రహదారిపై ఇసుక లారీ ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందారు. మరో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం శాంతినగర్ (పెంచికలపేట) ప్రధాన రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన మంతెన శంకర్(55) కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య శ్రీదేవి, పెద్ద కుమారుడు భరత్ (30) టిఎస్ఎండిసి కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా, రెండో కుమారుడు భార్గవ్ వాజేడులోని రెవెన్యూ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన మంతెన కాంతయ్య (65) కంసాలి పనిచేస్తూ కుటుంబాన్ని సాకుతున్నారు. అతడి భార్య మంతెన రేణుక.. ఈ దంపతులకు చాలా కాలం తర్వాత జన్మించిన కుమార్తె రాధిక చందన (13) ఉన్నారు. శంకర్ పెద్ద కుమారుడు భరత్ అయ్యప్పస్వామి మాలధరించడంతో మేడారం జాతర ముందు శ్రీరాజరాజేశ్వరి దర్శించుకోవడం కోసం కుటుంబ సభ్యులంతా కారులో గురువారం రాత్రి ఏటూరునాగారం నుంచి వేములవాడకు బయలుదేరారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఎల్కతుర్తి మండలం శాంతినగర్(పెంచికలపేట) వద్ద ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ఇసుక లారీ కారును ఢీ కొట్టింది. దాంతో కారు నుజ్జునుజ్జు కాగా డ్రైవింగ్ సీట్‌లో భరత్‌తో పాటు శంకర్, కాంతయ్య, రాధిక చందన అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు శ్రీదేవి, రేణుక, భార్గవ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. కాగా స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకొని.. కారులో ఉన్న క్షతగాత్రులను జెసిబితో బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజిఎంకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నట్టు ఎస్ఐ గోదారి రాజకుమార్ తెలిపారు. కాగా, మంత్రి సీతక్క క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.